## గర్భిణులకు ఆహార కిట్ల పంపిణీ



ఆహార కిట్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 5: పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించి గర్భిణులకు పౌష్టికాహార కిట్లను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్ అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆహార కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వదవాఖానల్లోనే కాన్పులు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఫాతిమా, ఆరోగ్యశాఖ అధికారులు కృష్ణమూర్తి, అంద్రూస్, సాయి, చంద్రశేఖర్, స్వరూప, రజిత, సంధ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కబ్జారాయుళ్లకు నోటీసులు

నవీపేట, డిసెంబర్ 5: మండల కేంద్రంలో నిజాంసాగర్ ఇరిగేషన్ స్థలాన్ని కబ్జా చేసిన వారికి నోటీసులు జారీ చేసినట్లు నవీపేట ఇరిగేషన్ ఏఈ శ్రీధర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బాసర మూలమలుపు వద్ద నిజాంసాగర్ డి- 50 ప్రధాన కాలువ ఇరిగేషన్ స్థలాన్ని మండల కేంద్రానికి చెందిన మేకల పోసానితో పాటు మరి కొంత మంది కబ్జా చేసి నిర్మించిన షెడ్డును ఏఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇరిగేషన్ స్థలం కబ్జాకు గురైందని, కబ్జా చేసిన వ్యక్తులకు నోటీసీలు జారీ చేస్తామని తెలిపారు. తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

## 13న నవగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

బోధన్ రూరల్, డిసెంబర్ 5: బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండా హనుమాన్ మందిరంలో ఈనెల 13న నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాందేవ్, కోశాధికారి రవిదాస్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు ప్రత్యేక హోమం, పూజలు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులతోపాటు పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## నేటి నుంచి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు

నందిపేట్, డిసెంబర్ 5 : మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామంలో నేటి నుంచి శ్రీ వర, వీర బాల హనుమాన్ దేవాలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. గంగపుత్ర సంఘం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గణపతి, నాగ, శివ, నంది, శిఖర నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 6న యజ్ఞం, 7న కుంకుమార్చన, 8న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతాయని వివరించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలుచేయాలి

**బోధన్ బీజేపీ అభ్యర్థి మోహన్‌రెడ్డి**




బోధన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఓటమిపొందిన బీజేపీ అభ్యర్థి వడ్డీ మోహన్‌రెడ్డి, పక్కన రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి

బోధన్, డిసెంబర్ 5: బోధన్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన తాను పోటీలో లేనని, తమ పార్టీకి ఓటేసినా గెలవదని, కాంగ్రెస్‌కే ఓటేయాలని కాంగ్రెస్ నాయకులు పోలింగ్‌కు ముందు తనపై దుష్ప్రచారం చేశారని ఇటీవలి ఎన్నికల్లో ఓడిపోయిన బీజేపీ అభ్యర్థి వడ్డీ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బోధన్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ తన ఎజెండాను ప్రజలకు చెప్పుకోవాలే తప్ప, తనపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదన్నారు. ప్రజలను మభ్యపెట్టే విధంగా కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో హామీలు ఇచ్చిందన్నారు. ఆరు గ్యారెంటీలను వెంటనే అమలుచేయాలని ఆయన డిమాండ్‌చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అడ్లూరి శ్రీనివాస్, నాయకులు టి.నర్సింహారెడ్డి, కూరెళ్ల శ్రీధర్, కౌన్సిలర్ మాసిని వినోద్‌కుమార్, పార్టీ నాయకులు మేక సంతోష్, కోల ఇంద్రకరణ్, మనోహర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ప్రారంభానికి సిద్ధం..

- మండల దుకాణ సముదాయం
- వేల్పూర్‌లో రూ.21 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- పరిషత్‌కు సమకూరనున్న ఆదాయం



పూర్తయిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

వేల్పూర్, డిసెంబర్ 5: వేల్పూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తికావడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మండల పరిషత్ సాధారణ నిధులు రూ.21లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపట్టారు. మొత్తం ఐదు షట్టర్లు పూర్తిచేశారు. మండల పరిషత్ కార్యాలయం రోడ్డును ఆనుకొని ఉండడంతో ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే వాటి ద్వారా పరిషత్‌కు ఆదాయం వస్తున్నదని భావించి మండల పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. రెండు నెలల క్రితం పనులు ప్రారంభించగా..కాంట్రాక్టర్ త్వరగా పూర్తిచేశారు.

### షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా ఆదాయం



మండల పరిషత్ కార్యాలయానికి విశాలమైన స్థలం ఉన్నది.ఖాళీగా ఉన్న స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే కొంత మేరకు మండల పరిషత్‌కు ఆదాయం వస్తుందని ఆలోచనతో పనులు చేపట్టారు.మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో నిర్మాణ పనులు పూర్తిచేశాం. షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తికావడంతో త్వరలోనే ప్రారంభిస్తాం.

–భీమ జమున, వేల్పూర్ ఎంపీపీ

# కొనసాగుతున్న కబడ్డీ పోటీలు



మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో ఏలేటి సాయిరెడ్డి స్మారక టోర్నమెంట్ 70వ మహిళా సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు రెండోరోజైన మంగళవారం కొనసాగాయి. ఈ టోర్నీలో రాష్ట్రంలోని 33 బాలికల జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకుడు ఏలేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఫైనల్ మ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు.

–మెండోరా, డిసెంబర్ 5

## బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి తరలిరావాలి

మాక్లూర్, డిసెంబర్ 5: ఆర్మూర్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో బుధవారం బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారని,మండలంలోని పార్టీ శ్రేణులు తరలిరావాలని ఎంపీపీ మాస్త ప్రభాకర్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ డైరెక్టర్లు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మండల, గ్రామ స్థాయి నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

## బోధన్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

రెంజల్, డిసెంబర్ 5 : బోధన్ పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి మహమ్మద్ షకీల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృస్థాయి సమావేశానికి మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లినట్లు పార్టీ మండల అధ్యక్షుడు భూమారెడ్డి తెలిపారు.

## ముగిసిన భీమన్న ఉత్సవాలు

ముప్కాల్ డిసెంబర్ 5: ముప్కాల్ మండల నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భీమన్న ఉత్సవాలు మంగళవారం ముగిశాయని సంఘ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని దూల గుట్టవద్ద ఉన్న భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘ సభ్యులు కంచు సతీశ్, వేంపల్లి గణేశ్, కంచు మోహన్, రవి, లింగం, కంచు విజయ్, మగ్గిడి రాజేందర్, వేంపల్లి ప్రతాప్, నాని, శ్రావణ్, కంచు ముత్యం తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 5: పట్టణంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో బీజేపీ కౌన్సిలర్ జీవీ నరసింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో 'ప్రపంచ నేల దినోత్సవం'

**నేల స్వభావంపై విద్యార్థులకు అవగాహన**



హున్సా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఆర్మూర్ రాంమందిర్ పాఠశాలలో బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

బోధన్ రూరల్, డిసెంబర్ 5: బోధన్ మండలం హున్సా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకుని నేలల స్వభావంపై అవగాహన కల్పించారు. రుద్రూరు ప్రాంతీయ చెరకు, వరి పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కృష్ణ చైతన్య మాట్లాడుతూ..నేల ఏర్పడే విధానం, నేల కోత నివారణకు క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి నేలను కలుషితం కాకుండా కాపాడుకోవాలని సూచించారు. శాస్త్రవేత్తలు సాయి చరణ్, పాఠశాల చైర్మన్ నారాయణ, హెచ్ఎం నగేశ్ పాల్గొన్నారు.

**ఆర్మూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై..**

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 5: పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల రాంమందిర్ పాఠశాలలో విద్యార్థులకు బాలల హక్కులు,బాల్య వివాహాల నిరోధక చట్టంపై సీడీపీవో భార్గవి, ఏసీడీపీవో జ్యోతి మంగళ వారం అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.